రైతు భరోసా సర్వే ప్రారంభం



మక్తల్‌లోని సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మక్తల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరుపై గ్రామాల్లో అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. సాగుచేసిన వారికి ఈ నెల 26 నుంచి అమలు చేసే రైతు భరోసా పథకానికి అర్హులని తహసీల్దార్ సతీస్‌కుమార్ తెలిపారు. అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కోస్గిరూరల్: గుండుమాల్ పరిధిలోని బోగారం, అమ్లీకుంట గ్రామాల్లో అధికారులు సర్వే చేపట్టారు. రెండు గ్రామాల్లో సుమారు 16ఎకరాల భూమిని గుర్తించినట్లు తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. ఈ నెల 20 వరకు సర్వే కొనసాగుతుందని, ఈ నెల 20నుంచి 25వరకు గ్రామసభ నిర్వహించి తుది జాబితా సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్రాములు, సీనియర్ అసిస్టెంట్ రామేశ్వరి, ఏఈఓలు తిరుపతి, నరేందర్, అచ్చన్న పాల్గొన్నారు.

● ధన్వాడ మండలంలోని కంసాన్‌పల్లి, యంనోనిపల్లి గ్రామాల్లో ఎంత భూమి ఉంది అందులో సాగు చేసిదెంత, సాగుచేయని భూములేంత అనేదానిపై ఎంపీడీఓ సాయిప్రకాష్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, శ్రీనివాసరావు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

● మరికల్ మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిల్‌కుమార్ నూతనంగా మంజూరు చేయనున్న రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన మార్గనిర్దేశంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, ఏఓ దినాకర్, ఏఈఓ పరుశురాం, సర్వేయర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది మురళి తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: రైతు భరోసాలో భాగంగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు మండల తహసీల్దార్ జయరాములు, వ్యవసాయ అధికారి మణిచందర్ నోడల్ అధికారులుగా సర్వేను పర్యవేక్షించారు. గ్రామ కంఠంలో ఉన్న భూములు, నాల కన్వర్షన్ లేకుండా ఇళ్లు నిర్మించిన భూములు, రియల్ ఎస్టేట్, ప్రభుత్వం సేకరించిన భూములు, గుట్టలు సాగుకు యోగ్యం కాని ఇతర భూముల వివరాలపై సర్వే చేపట్టారు. కార్యక్రమంలో సర్వే బృందాలు, ఆర్ఐ, రెవెన్యు సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.



మరికల్‌లో..



కంసాన్‌పల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ సాయి ప్రకాష్



దామరగిద్ద మండలం పిడెంపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

కోటకొండను మండలంగా ప్రకటించాలి



ధర్నాలో మాట్లాడుతున్న హన్మేష్

నారాయణపేట రూరల్: కోటకొండను మండలంగా ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. గురువారం కార్యక్రమాన్ని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు హన్మేష్ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచిన వెంబడే కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తామని ఎన్నికలముందు కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి హామీ ఇచ్చి ఈ ప్రాంత ప్రజల ఓట్లను దండుకుని, అధికారంలోకొచ్చి ఏడాది గడిచినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా తమకు కావాల్సిన కొన్నింటిని మాత్రం ఏర్పాటుచేసుకొని మిగతా మండలాల సంగతి గాలికి వదిలేశారని వాపోయారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కోటకొండను మండలంగా ఏర్పాటుచేయాలన్నారు. అంతకుముందు కోటకొండ నుంచి బైక్ ర్యాలీగా పేటకు వచ్చి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బి. రాము, కాశీనాథ్, యాదగిరి, జయలక్ష్మి, ఓం ప్రకాష్, వెంకట్‌రాములు, హన్మంతు, చెన్నారెడ్డి, నర్సింహులు, నారాయణ, రాములు, సుభాష్, సునీత, సరళ, అంజి, సలీం, నారాయణ పాల్గొన్నారు.

కంది రైతు దిగాలు




దామరగిద్దలో ఇంట్లో కంది ధాన్యం నిల్వలు

- తగ్గిన ధరలు.. పెరిగిన పెట్టుబడి
- ఇంట్లోనే ధాన్యం నిల్వలు
- ధరల పెరుగుదలపై ఆశలు

దామరగిద్ద: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మార్కెట్‌కు తరలించే లోపే పెరిగిన ధరలు తగ్గుముఖం పట్టడంతో పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక అమ్ముకోవాలో నిల్వచేసుకోవాలో తెలియక కంది ధాన్యాన్ని ఇళ్లల్లో నిల్వచేసుకున్న దుస్థితి నెలకొంది. మండలంలో ఈ ఏడాది అత్యధికంగా 15వేల ఎకరాల్లో కందిపంట సాగుచేశారు. కంది పంట జూన్ నెలలో సాగుచేస్తే డిసెంబర్‌లో కోతకు వస్తుంది. ఏడాది కాలంగా ఒకే పంటను నమ్ముకొని పండించిన రైతులకు సాగు ఖర్చులు, కలుపుతీత మొదలు నూర్పిడి వరకు ఎకరాలకు రూ. 20 నుంచి రూ. 25వేల పెట్టుబడి అవుతుంది.

ఇళ్లల్లో ధాన్యం నిల్వలు

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరకు విక్రయిస్తే పెట్టుబడులు పోను చేతి కష్టం మిగలడం లేదని రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అధిక విస్తీర్ణంతో పంట సాగు చేసిన ఎకరాకు 5 నుంచి 7క్వింటాళ్ల ధాన్యం పండించారు. అధిక మొత్తంలో పంట పండించిన రైతులు ధరలు పెరుగుతాయనే ఆశతో పండించిన ధాన్యాన్ని ఇళ్లల్లోనే నిల్వచేసుకుంటున్నారు. గత డిసెంబర్ క్వింటాళ్ల ధర రూ. 9వేల నుంచి రూ. 10500 వరకు పలికింది. ఈ సంవత్సరం తీర 22 రోజులు గడిచినా ధరల పెరుగుదలలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే మార్కెట్ రేట్ అధికంగా ఉండటంతో ధరలు పెరుగుదల మార్కెట్ డిమాండ్‌పై ఆధారపడి ఉంటుందనేది వ్యవసాయ మార్కెట్ అధికారుల అంచనా. రైతులు మాత్రం ధరలు పెరుగుదలపై ఎంతో ఆశతో ధాన్యం మార్కెట్‌కు తరలించకుండా నిల్వ చేసుకుంటున్నారు.



నారాయణపేట మార్కెట్‌లో కంది విక్రయాలు

గిట్టుబాటు ధర లభించడం లేదు..



ఏడాది కాలంలో ఒకే పంటగా పండించే కంది పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. పదెకరాల్లో రూ. 2లక్షల పెట్టుబడితో పంట పండించాను. 90 బస్తాల ధాన్యం పండింది. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి ఉంటే బాగుండేది. – అనిల్‌రెడ్డి, రైతు, దామరగిద్ద

ఇంట్లోనే నిల్వ చేశాం..



మార్కెట్‌లో కోతల సమయంలో ఉన్న ధర ప్రస్తుతం లేకపోవడంతోపాటు రూ. 10వేలు ఉన్న ధర 8వేలకు పడిపోయింది. ధరలు తగ్గడంతో పంట పండించేందుకు పెట్టిన పెట్టుబడులు రావడం లేదు. మార్కెట్‌లో డిమాండ్ పెరిగిన ధరలు పెరిగితే బాగుండేది. –మధుసూదన్‌రెడ్డి, రైతు మద్దెల్‌బీడ్

క్లుప్తంగా

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మక్తల్: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సీఐ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, కృష్ణంకాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శబరికి తరలిన స్వాములు

మద్దూరు: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మహేష్, రాజు గురుస్వాములు ఇరుముడులను కట్టుకొని శబరికి తరలి వెళ్లారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భక్తులు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, రామకృష్ణ, రాములుగౌడ్, నవీన్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



ఊట్కూరు: మండలంలోని శ్రీ గోశాల ఆంజనేయస్వామి ఆలయంలో షెడ్ నిర్మాణానికి గురువారం మిడిదొడ్డి శీనయ్య రిటైర్డ్ అధికారి రూ. 2లక్షల 30వేలు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ వారు ఆయనకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సీ చందులాల్, శంకరప్ప, నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, దత్తు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి



ధన్వాడ: మండల కేంద్రంలో స్వామివివేకానంద విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ.. గురువారం యువజన సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ సాయిప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, చంద్రకాంత్, ప్రశాంత్, నర్సింహులు, వెంకట్‌రాములు, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



మక్తల్: జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం దుస్తులు అందజేశారు. ఈ నెల 17నుంచి 20వరకు భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనున్నట్లు వారు విలేకరులకు తెలిపారు. అనంతరం ఎంపికైనా క్రీడాకారులను అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఊట్కూరు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవి చేతులమీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చాంద్ సుల్తానా, నాయకులు విజ్ఞేశ్వర్‌రెడ్డి, దశరథ్, శేఖర్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

కంటైనర్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

మరికల్: మండల కేంద్రంలో పనులు ముగించుకొని స్వగ్రామానికి బైక్ వెళ్తున్న యువకుడిని బుధవారం రాత్రి కంటైనర్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చిన్నచింతకుంట మండలం దామగ్నపూర్‌కు చెందిన కురుమూర్తి మరికల్‌లో ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. పనులు ముగించుకుని గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. పెద్దచింతకుంట సమీపంలో బైక్‌ను కంటైనర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మిల్లు వద్ద కొందరు యువకులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

బీరప్ప ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఊట్కూరు: మండలంలోని గ్రామ శివారులో ఫిబ్రవరి 1నుంచి ప్రారంభం కానున్న శ్రీ బీరప్ప ఉత్సవాల ఏర్పాట్లను గురువారం ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ పరిశీలించారు. గ్రామ శివారులో ఆలయానికి వెళ్లే రోడ్డు, నీటివసతి గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మట్టి రోడ్డు మరమ్మతు చేపట్టాలని తాగునీటికోసం ప్రత్యేక వసతి కల్పించాలని, విద్యుత్ తీగల మరమ్మతు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజ్ఞేశ్వర్‌రెడ్డి, లైన్‌మేన్ మల్లేష్, నిర్వాహకులు కుర్వగోవిందప్ప, కుర్వఆశప్ప ఉన్నారు.

నవోదయ ప్రవేశాల మాదిరి పరీక్ష



మాదిరి పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ఆత్మకూర్: నవోదయ, గురుకులంలో నిరుపేద విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు గురువారం నిర్వహించిన ఉచిత మాదిరి పరీక్ష విజయవంతమైందని లిటిల్‌ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మీర్జాఅన్వర్‌బేగ్, మీర్జాఅక్తర్‌బేగ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18న ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉచిత మాదిరి పరీక్షను నిర్వహించామన్నారు. దేవరకద్ర, మదనాపురం, అమరచింత, ఆత్మకూర్, కొత్తకోట, నర్వ, చిన్నచింతకుంట మండలాల నుంచి 50 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, రఘురాం, సౌజన్య, నందిని, ఆలియా, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నారాయణపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 2013 –14 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దాదాపు 11ఏళ్ల తర్వాత ఓ ఫంక్షన్ హాల్ లో కలుసుకొని వారి యోగక్షేమాలను ఒకరికొకరు పంచుకున్నారు. అనంతరం పాఠాలు నేర్పిన టీచర్లను శాలువా, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంత్ రెడ్డి, శ్రీనివాస్, రాజేష్‌కుమార్, సిద్రాంరెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకట్రాములు, జ్యోతి పాల్గొన్నారు.

వేగ నియంత్రికల ఏర్పాటు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో గురువారం స్వచ్ఛందంగా గ్రామస్తులు రహదారులపై రోడ్డు వేగనియంత్రికలను వేశారు. పెద్దచింతకుంట స్టేజీ నుంచి లాల్‌కోట గ్రామానికి వెళ్లేరోడ్డు కావడంతో వాహనాల వేగం తగ్గించేందుకు, ప్రమాదాలు జరగకుండా గ్రామస్తులు రోడ్డుపై వేగ నియంత్రికలను వేశారు.

ఘనంగా ఎడ్ల బండ్ల గిరక పోటీలు



మరికల్: మండలంలోని మండల వికాసవేదిక ఆధ్వర్యంలో గురువారం రైతులకు రెండు ఎడ్ల బండ్ల గిరక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు గానుచుట్టూ పక్కల గ్రామాల నుంచి 25జతల ఎడ్లు వచ్చాయి. ఉత్సాహంగా రైతులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన మొదటి విజేత మరికల్ 15తులాల వెండి, రెండవ విజేత ఎలిగండ్ల 10తులాల వెండి నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, బసంత్, వీరన్న, కృష్ణయ, హన్మిరెడ్డి, రాజేష్, రాజు, హరీష్, రామస్వామి, ప్రవీణ్, రాములు పాల్గొన్నారు.

రైతు వేదికల నిర్వహణ ఎలా?



మరికల్ రైతు వేదిక

- ఖర్చులను భరిస్తున్న ఏఈఓలు
- ప్రతి నెలకు రూ. 9వేల ఖర్చు

మరికల్: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి సమస్యల సాధనకు, పంటలపై అవగాహన నిమిత్తం నిర్మించిన రైతు వేదికలకు ఏళ్ల తరబడి నిర్వహణ భత్యం లేక ఏఈఓలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు నిరంతరంగా సమావేశాలు నిర్వహించుకొని పంటలసాగు, వ్యవసాయంలో కొత్త విధానాలు, అధికారులు సూచనలు తెలుసుకునేందుకు వీలుగా అన్ని మండలాల్లో రైతు వేదికలను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ క్లస్టర్ల వారీగా వీటిని నిర్మించింది. వ్యవసాయశాఖతోపాటు అనుబంధ విభాగాలు, ఇతర శాఖలకు సంబంధించి అవసరమైన సమావేశాలు అప్పుడప్పుడు నిర్వహిస్తున్నారు. కానీ వాటి నిర్వహణకు ప్రభుత్వం మారిన నిధులు కేటాయించడం లేదు.

ఏఈఓలకు కష్టాలు..

రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఏఈఓలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సంబంధించి సమావేశాలు నిర్వహించినప్పుడు నిర్వహణకు సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు చెల్లించకపోవడంతో వారికి అవస్థలు తప్పడం లేదు. చివరకు విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వానాకాలం, యాసంగి పంటల సీజన్ దృష్టిలో పెట్టుకొని నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

శిక్షణ కార్యక్రమాలు–సమావేశాలు

మరికల్‌తోపాటు కన్మనూర్, పెద్దచింతకుంట, జిన్నారం, పూసల్‌పహాడ్ గ్రామాల్లో రైతు వేదికలను నిర్మించారు. వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా రైతు వేదికలో వసతి కల్పించారు. ప్రత్యేకంగా ఫర్నిచర్ కూడా సమకూర్చారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైకు వంటివి ఏర్పాటు చేశారు. సీజన్ల వారీగా పంటల సాగుపై అవసరమైన వారికి సలహాలు, సూచనలు ఇస్తుంటారు.

ప్రతి నెల నిర్వహణ ఖర్చులు

అంశం	ఖర్చులు (రూ.లలో)
పరిశుభ్రత, కాపాలదారు	3,000
శిక్షణ కార్యక్రమాల ఖర్చు	2,500
స్టేషనరీ జిరాక్స్	1,000
విద్యుత్ ఛార్జీలు	1,000
నిర్వహణ మరమ్మతు	1,000
తాగునీరు	500

ప్రభుత్వానికి నివేదించాం..

రైతు వేదికల నిర్వహణ నిధులపై ప్రభుత్వానికి నివేదించాం నిధులు విడుదల కాగానే కేటాయిస్తాం. ప్రస్తుతం నిధులు లేక ఇబ్బందులున్న మాట వాస్తమే. రైతులకు పంటలపై అవగాహన సదస్సులు నిర్వహణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

జాన్‌సుధాకర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, నారాయణపేట

మండల అధ్యక్షుడిగా శంకరయ్య



ఊట్కూర్: మండల రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయ మండల అధ్యక్షుడిగా కే శంకరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండలంలోని ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చౌద్రి చందూలాల్, అధ్యక్షుడు కే.శంకరయ్య, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, సావిత్రమ్మ, ప్రధాన కార్యదర్శి కే.శంకర్, సహాయ కార్యదర్శి సురేష్‌లింగం, కో–శాధికారి జి. జనార్ధన్ రెడ్డి, కో–ఆర్డినేటర్ ఎస్.చందూలాల్, సలహాదారులుగా కే. గోవిందప్ప, కనకప్ప ఆర్య, శేషప్ప ఎన్నికయ్యారు.

ప్రార్థన మందిరాలకు యూనివర్సల్ తాళాల పంపిణీ



అమరచింతలో జమీయా మసీదు నిర్వాహకులకు తాళాలను అందిస్తున్న ఎస్ఐ సురేష్

అమరచింత: పట్టణంలోని జామీయా మసీదు నిర్వాహకులకు యూనివర్సల్ తాళాలను ఎస్ఐ సురేష్ గురువారం అందించారు. ఈమేరకు ఎస్ఐ మాట్లాడుతూ ఆలయాలు, చర్చీలు, మసీదుల్లో ఎక్కడో ఒక చోట చోరీలు జరుగుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయని, వీటిని అరికట్టేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన తాళాలను పోలీసు శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లోని మసీదులు, ఆలయాలు, చర్చీల నిర్వాహకులను పిలిపించి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో జామీయా మసీదు అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ఖాజాహుస్సేన్, తౌఫిక్, పాషా పాల్గొన్నారు.

మహాసభలకు తరలిరండి



ఆత్మకూర్: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రెండో రాష్ట్ర మహాసభలను ఈనెల 19న మహబూబాబాద్‌లో జరుగుతున్నాయని, కార్మికులు వేలాదిగా తరలిరావాలని టీయూసీఐ నాయకులు హనుమంతు, ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పాత మున్సిపాలిటీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు సతీష్, శివన్న, మైనోద్దీన్, ఇస్మాయిల్, బాలరాజు, గోవర్ధన్, కార్మికులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని శ్రీఆదిఆంజనేయస్వామి దేవాలయానికి మండలంలోని అనంతపూర్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఆంజనేయులు రూ.22 వేల విలువ గల మైక్‌సెట్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు డిఎం. రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కొత్తగంజ్ జట్టు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కొత్తచెరువు రోడ్ ప్రాంతంలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో కొత్తగంజ్ జట్టు విజేతగా నిలిచింది. చివరిరోజు గురువారం టీడీగుట్ట జట్టు రెండో స్థానం కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో మొత్తం 14జట్లు పాల్గొనగా మొదటి స్థానం దక్కించుకున్న జట్టుకు రూ.15వేలతో పాటు ట్రోఫీని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్.పి.వెంకటేష్ అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.ఐదు వేల నగదు బహుమతి ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవియాదవ్, యాదయ్య, తిరుపతి, శంకర్, నందిపేట రాజు పాల్గొన్నారు.